చేపలు అమ్మేదెలా?







- మార్కెటింగ్ కోసం జిల్లాలోని మత్స్యకారుల కష్టాలు
- చేపల ఎగుమతుల కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఏటా 40 వేల టన్నుల చేపల ఉత్పత్తి
- లోకల్ మార్కెట్ పైనే అంతా భారం
- జిల్లా చేపలకు నాగపూర్, హైదరాబాద్‌లో భారీ డిమాండ్

నిర్మల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మత్స్యకారులంతా చేపల ఎగుమతుల కోసం ఏళ్ల నుంచి ఎదురు చూపులు చూస్తున్నారు. మత్స్యశాఖ మాత్రం ఆ దిశగా ఆశించిన మేరకు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మత్స్యశాఖ అధికారులు కేవలం లోకల్ మార్కెట్‌కు అనుగుణంగానే మత్స్యకారులను ప్రోత్సహిస్తున్న కారణంగా వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదంటున్నారు. జిల్లాలోని గోదావరి దాని ఉపనదుల పరివాహకంలో ఉన్న అనేక రిజర్వాయర్లు, కాలువలు, చెరువులలోని చేపలకు రుచి కారణంగా స్థానికంగానే కాకుండా హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగపూర్‌లలో వాటికి విపరీతమైన డిమాండ్ ఉంటోంది. అయితే స్థానికంగా చేపల పెంపకం, ఉత్పత్తి గణనీయంగా ఉంటుండడం ఆ మేరకు డిమాండ్ లేకపోతుండడంతో మత్స్యకారులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతీ ఏటా దాదాపు 40 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ స్థానికంగా మార్కెట్ అందుబాటులో లేకపోవడం మత్స్యకారులకు శాపంగా మారుతుంది. కొద్దిరోజుల క్రితం చేపలను ఇతర ప్రాంతాలకు మార్కెటింగ్ చేసేందు కోసం అనుకూలమైన ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఫిష్ పేరిట నోడల్ సెంటర్లను ఏంపిక చేయాలని ప్రతిపాదించింది. నోడల్ సెంటర్ల ద్వారా ప్రధాన పట్టణాలు, నగరాలకు చేపలను ఎగుమతి చేయాలని భావించారు. అయితే ఆ ప్రతిపాదనలు ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. స్థానికంగా చేపల మార్కెట్లను అభివృద్ధి చేస్తూనే ఇతర ప్రాంతాలకు ఎగుమతులను ప్రోత్సహిస్తే మత్స్యకారులకు పెద్దమొత్తంలో ప్రయోజనం చేకూరుతుందంటున్నారు. ఇటీవలే ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ స్థానికంగా డిమాండ్ అవసరమవుతోంది. ఉమ్మడి జిల్లాలో నీటి వనరులు పెద్దసంఖ్యలో ఉంటుండడంతో చేపల ఉత్పత్తులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే పెరుగుతున్న చేపల ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్, ఎగుమతులు లేకపోతుండడం మత్స్యకారులను నిరాశ పరుస్తోంది.



చేప పిల్లలకు అనుకూలంగా భారీ సంఖ్యలో రిజర్వాయర్లు

చేపపిల్లల పెంపకానికి జిల్లాలో పెద్దసంఖ్యలోనే నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. గోదావరినది దాని ఉపనదులతో పాటు మొత్తం 14 రిజర్వాయర్లు, అలాగే 1,501 చిన్న నీటివనరులు జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. దీంతో పాటు 320 మత్స్య సహకార సంఘాలు ఉండగా ఈ సంఘాలలో 20 వేల కుటుంబాలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. ప్రతీ ఏటా 10 కోట్ల చేప పిల్లలను ఈ నీటి వనరులలో వదులుతున్నారు. కాగా మొత్తం ఈ నీటి వనరులలో 40 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని చిన్న నీటి వనరులలో బొచ్చ, రాహు, బంగారు తీగ, అలాగే రిజర్వాయర్‌లలో మ్రిగాల అనే రకం చేపపిల్లలను పెంచుతున్నారు. అయితే ఈ రకం చేపలకు నాగపూర్, హైదరాబాద్‌తో పాటు మరికొన్ని ప్రధాన నగరాలలో విపరీతమైన డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఇతర చేపల కన్నా ఈ చేపలు ఎక్కువ రుచిగా ఉంటాయంటున్నారు. దీని కారణంగానే ఈ చేపలకు స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా డిమాండ్ ఉంటున్నట్లు అలాగే ఈ రకమైన చేపలు ఎగుమతులకు ఎంతో అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు.

ఎగుమతులపై దృష్టి పెట్టాలి

స్థానికంగా ఉత్పత్తయ్యే చేపలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందు కోసం అవసరమైన సౌకర్యాలను కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ చేపల ఎగుమతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి అనుగుణంగా కలెక్టర్ అనుకూలమైన చోట్ల ఐస్‌ఫ్యాక్టరీల ఏర్పాటు దిశగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఆర్థికంగా సహకరించి వారి చేతనే ఐస్‌ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడం ద్వారా చేపల ఎగుమతి జరిగేటట్లు చూడడం లాంటి చర్యలపై కసరత్తు జరపాలని కలెక్టర్ మత్స్యశాఖ అధికారులకు సూచించారు. అనుకూలత ఉన్నచోట్ల కోల్డ్ స్టోరేజ్‌లను కూడా ఏర్పాటు చేసే దిశగా పరిశీలన జరపాల్సి ఉంటుందంటున్నారు.



అతి త్వరలో టెండర్లు ఆహ్వానిస్తాం

- బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాసర / భైంసా, జనవరి 9 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో గత రెండున్నర ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివిధ టెండర్లను అతి త్వరలో ఆహ్వానిస్తామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ తెలిపారు. గురు వారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'బాసర యూని వర్సిటీలో అంతులేని అవినీతి' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. హైదరాబాద్‌లో ఉన్న వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ హుటాహుటిన బాసర క్యాంపస్‌కు వచ్చి సంబంధిత సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని టెండర్లను సాధ్యమైనంత తొందరగా నిర్వహించేలా డాక్యుమెంట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఒకటి, రెండు మీటింగ్‌లు ఏర్పాటు చేసి.. నాణ్యత, అర్హత, అనుభవంతో కూడిన ప్రాధాన్యతలను ఇస్తూ పారదర్శకంగా టెండర్లకు సిద్ధం కావాలన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కూడా ఆరా తీశారు. వైస్ చాన్స లర్‌ను పిలిపించుకొని నిర్మల్ కలెక్టర్ కార్యాయలంలో ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్ట్ సంస్థల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. గడువు ముగిసినా కాంట్రాక్టు సంస్థలు కొనసాగడంపై కలెక్టర్ కూడా అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే టెండర్లు నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.

బాసర ట్రిపుల్ ఐటీలో అవినీతిని తుద ముట్టించేందుకు కృషి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే రామరావ్ పాటిల్



చదువుల తల్లి కొలువైన బాసరలోని ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో నెలకొన్న అవినీతి, అక్రమాలను తుదముట్టించేందుకు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చదివిన ఎమ్మెల్యే.. సంబంధిత కథనంలోని అంశాలపై పలువురు వర్సిటీ అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడువు ముగిసినా.. కాంట్రాక్టులు కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో కాంట్రాక్టు విధానంలో కొనసాగుతున్న వాటి వివరాలన్నింటినీ నివేదిక రూపంలో అందించాలని వర్సిటీ అధికారులకు సూచించారు. బాసర వర్సిటీలోని అవినీతి,అక్రమాలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి నిర్వహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరిగేలా చూస్తానని వెల్లడించారు. బాసర ట్రిపుల్ ఐటీలో అవినీతిని తుద ముట్టించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అవినీతి బాగోతంపై కథనాన్ని ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'ని ఎమ్మెల్యే అభినందించారు.

ఏరియా ఆసుపత్రిలో

టీబీ వ్యాధి నిర్ధారిత పరీక్షల నిర్వహణకు చర్యలు

భైంసా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో టీబీ వ్యాధి నిర్ధారిత పరీక్షలు నిర్వహణకు చర్యలు చేపట్టామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీబీ వ్యాధి నిర్ధారిత పరీక్షల నిర్వాహణకు అసరమైన ట్రూనాట్ పరికరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లుగా వెల్లడించారు. ఇది వరకు సంబంధిత పరికరం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో ఉండగా పలు కారణాలతో నిర్మల్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖాధికారులతో మాట్లాడి అక్కడికి తరలించిన ట్రూనాట్ పరికరాన్ని తిరిగి ఇక్కడికి వచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా భైంసా పట్టణ పరిధిలోని పలు వార్డు వాసులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన అర్థిక సహాయపు చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ అందచేశారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ తోట విజయ్, బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, సుష్మారెడ్డి, తోట లింగురామ్, గాలి రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

ముథోల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన మండల అధ్యక్షులను, కౌన్సిల్ మెంబర్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వారి నియామకాన్ని గురువారం ప్రకటించారు. జిల్లాలోని 11 మండలాల అధ్యక్షుల ఎన్నిక, జిల్లా కౌన్సిల్ మెంబర్లకు ఎన్నిక తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. నిర్మల్ అసెంబ్లీలోని సోన్ మండల అధ్యక్షులుగా మారి గంగారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా డా. నరేష్, నిర్మల్ రూరల్ అధ్యక్షులు ఏనుగు వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా తోకల అనిల్ నియామకం అయ్యారు. ఖానాపూర్ అసెంబ్లీలో ఖానాపూర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా కీర్తి మనోజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా నాయిని సంతోష్, ఖానాపూర్ రూరల్ అధ్యక్షుడిగా పుప్పాల ఉపేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా టేకు ప్రకాష్, కడెం పెద్దూర్ అధ్యక్షుడిగా కే. శ్రీనివాస్ యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా ధర్మాజీ కిష్టయ్య, పెంబి మండల అధ్యక్షుడిగా ఈ. వెంకటేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా అంగ నర్సయ్య, ముథోల్ అసెంబ్లీలో భైంసా రూరల్ అధ్యక్షులుగా సీరం సుష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా గొర్రెకల్ల భూమేష్, ముథోల్ మండల అధ్యక్షులుగా కోరి పోతన్న, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా దేవోజీ భూమేష్, తానూర్ మండల అధ్యక్షులుగా పుండూర్ లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా గోప కైలాష్, లోకేశ్వరం మండల అధ్యక్షులుగా బి. సాయన్న, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా మహేందర్‌రెడ్డి, కుభీర్ మండల అధ్యక్షులుగా ఏ. దత్తాత్రి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా జాదవ్ పండిత్‌లు నియమితులైనట్లు తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి


దుకాణాల లైసెన్స్‌లను రెన్యూవల్ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార యజమానులు తమ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కైలాష్ రాథోడ్‌లు అన్నారు. గురువారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో కేంద్రంలో పర్యటించి దుకాణాల లైసెన్స్‌లను రెన్యువల్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతి దుకాణదారుడు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు డబ్బాలలో వేయాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పటిష్టచర్యలు

జిల్లాలోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి : కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, ధరణి దరఖాస్తుల పరిష్కారం, తదితర రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మండలాల వారీగా నది, వాగులు వంటి ఇసుక అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, రహదారులు, భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి వాటికి ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, ఇసుక అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు, వాణిజ్య, తదితర వాటికి రుసుము చెల్లించిన వారికే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా గుర్తించిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ప్రధాన రహదారులపై తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, తహసీల్దార్లు సమన్వయంతో అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని, భారీ జరిమానాలు విధించడంతో పాటు సంబంధిత వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని సూచించారు. అలాగే ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,665 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలలో ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, దేవాదాయ, అటవీ, వక్ఫ్ తదితర భూములను సర్వే నెంబర్ల వారీగా రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించిన రిపోర్టులను అందజేయాలన్నారు. అలాగే మండలాల వారీగా కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ సుదర్శన్, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పదిలో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలి

విద్యాశాఖ జిల్లా అధికారి రామారావు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ముథోల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా డీఈవో రామారావు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై చర్చించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వెనుకబడుతున్నటువంటి 10వ తరగతి విద్యార్థులను ప్రత్యేక తరగతుల ద్వారా వారిని ప్రోత్సహించాలని సూచించారు. బడికి రాని విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బడికి వచ్చే విధంగా వారందరినీ 10వ తరగతిలో ఉత్తీర్ణులు కావడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులందరినీ పేర్కొన్నారు. ఈయన వెంట సెక్టోరియల్ ఆఫీసర్ రాజేశ్వర్, లింబాద్రి, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.


నర్సాపూర్(జి) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నర్సాపూర్(జి), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈవో రామారావు సూచించారు. గురువారం నర్సాపూర్(జి) ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం వేళ విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.

మత్తు పదార్థాల వ్యసనంతో జీవితం సర్వనాశనం

దిలావర్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వ్యసనంతో జీవితం సర్వ నాశనం అవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు ఆనందం అన్నారు. ఆహ్లాదకరమైన కళాశాల - ఆరోగ్యకరమైన అలవాట్లు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం అసెంబ్లీ సమయంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్యం, ఆర్థిక సమస్యలపై అవగాహన కల్పించారు. ధూమపానం, కొకెన్, గుడుంబా, మద్యం మొదలైన వాటికి బానిస అయితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. నేటి యువత డ్రగ్స్‌కు అలవాటు పడి ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్న వైనాన్ని వివరించారు. మాదక ద్రవ్యాల బారిన పడకుండా ప్రతి విద్యార్థి జాగ్రత్త పడాలని సూచించారు. మత్తు పదార్థాల అలవాటు వల్ల శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. కుటుంబంలో మనశ్శాంతి లేక కుటుంబం చిన్నాభిన్నం అవుతుందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు అయిన వారు డాక్టర్‌ను సంప్రదించి కౌన్సిలింగ్ తీసుకోవడం ద్వారా సాధారణ జీవితం కొనసాగించవచ్చని తిరిగి వాటి జోలికి వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో రైతు దుర్మరణం

- సాంగ్విలో విషాదం



దిలావర్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన పంతులు భూమన్న(69) అనే రైతు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. భూమన్న రోజూలాగే రాత్రి వేళ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరును స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా.. తెగి పడి ఉన్న విద్యుత్ వైర్‌కు ప్రమాదవశాత్తూ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు. కాగా.. అందరితో కలివిడిగా ఉండే భూమన్న మృతితో సాంగ్విలో విషాదం నెలకొంది.

పురుగుల మందు తాగిన వ్యక్తిని

రక్షించిన 108 సిబ్బంది



నర్సాపూర్(జి), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి తండా గ్రామానికి చెందిన రాథోడ్ జ్ఞానేశ్వర్ కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది పరుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే 108కి ఫోన్ చేయగా 108 సిబ్బంది 18 నిమిషాల్లో గమ్యం చేరుకొని, జ్ఞానేశ్వర్ తాగిన విషపదార్థాన్ని కక్కించి ప్రాణం కాపాడారు. ఈఎంటీ మామిళ్ల ప్రమోద్‌ను గ్రామస్థులు అభినందించారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి


కుంటాలలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కుంటాల, జనవరి, 9: (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ లింబాద్రి అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడుతూ పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


ఏపీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన శేఖర్



ఏపీ మంత్రిని కలిసిన దుర్గం ట్రస్టు చైర్మన్ దుర్గం శేఖర్

ఆదిలాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు సాధించిన దుర్గం ట్రస్టు చైర్మన్ దుర్గం శేఖర్ గురువారం తిరు మల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి వైకుంఠ ఏకాదశి దర్శనానికి వెళ్లారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే సమయంలో పక్క సీట్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు మాజీ మంత్రి స్వర్గీయ రామచంద్రారెడ్డి మా గురువు పరిచయంతో ఆదిలాబాద్ విశేషాలను చర్చించారు. గతంలో అనారోగ్యంతో సీఆర్ఆర్ మృతి చెందారన్న విషయం తెలుపగా మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. రిమ్స్ ఆసుపత్రి కోసం వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న క్యాబినెట్‌లో తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసి ఆదిలాబాద్ జిల్లా పేద ప్రజల ఆరోగ్యం కాపాడడానికి రిమ్స్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌ని నిర్మించారని గుర్తు చేశారు.

తాగిన మైకంలో సెల్ టవర్ ఎక్కిన యువకుడు



భీర్సాయిపేటలో టవర్ ఎక్కిన తిరుపతి

ఉట్నూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య జరిగిన గొడవతో తాగిన మైకంలోనే టవర్ ఎక్కి హల్చల్ చేసిన యువకుడి ఘటన ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేటలో చోటు చేసుకుంది. రామలింగంపేటకు చెందిన మంగం తిరుపతి వివాహం అనంతరం అత్త గారి గ్రామమైన బీర్సాయిపేటలో జీవిస్తున్నాడు. ప్రతీ రోజు భార్యను మద్యం తాగి వేధింపులకు గురి చేస్తుండడంతో అత్తమామలు సైతం మందలించారు. తీరు మార్చుకోని తిరుపతితో ఇబ్బందులు పడుతున్న భార్య జ్యోతి గురువారం ఆగ్రహం వ్యక్తం చేయడంతో బీర్సాయిపేటలో ఉన్న టవర్ ఎక్కి చనిపోతానంటూ కుటుంబ సభ్యులను బెదిరించాడు. సంఘటన విషయం తెలు సుకున్న ఉట్నూర్ ఎస్సై మనోహర్ బీర్సాయిపేట చేరుకొని తిరుపతిని సము దాయించి టవర్ దిగిపించేలా కృషి చేసి భార్యభర్తలను ఉట్నూర్ పోలీసు స్టేషన్ ఎందుకు తెచ్చిన అనంతరం కౌన్సెలింగ్ చేసి వదిలానని ఎస్సై మనోహర్ వివరించారు.

ఆటో డ్రైవర్ అరెస్టు

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బజార్ హత్నూర్ మండలంలోని దేగామ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పాలెపు రాకేష్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు బోత్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7న ఆటో డ్రైవర్ అతిగా మద్యం తాగి అజాగ్రత్తగా ఆటో నడపడంతో దేగామా గ్రామ శివారులలో బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు మృతి చెందారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట బజార్ హత్నూర్ ఎస్సై అప్పారావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరడిగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ కోసం విద్యుత్ మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం మధ్యాహ్నం 10.30 గంటల నుంచి 3.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదివాసీ గిరిజనుల పూజలు



ఘన్‌పూర్‌లో భీమల్‌పెన్ పూజలు చేస్తున్న ఆదివాసులు

ఉట్నూర్,జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పుష్యమాసం అంటే ఆదివాసులకు ఎంతో ప్రీతి. పవిత్ర మాసంగా భావిస్తున్న ఆదివాసులు తమ ఇలవేల్పులను, ఇంటి దేవతలను, వంశ దేవతలకు పుష్యమాసంలో ఘనంగా పూజలు నిర్వహిస్తారు. ఉట్నూర్ మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన వేలాది పరివార్ ఆధ్వర్యంలో ఆదివాసులు భీమల్‌పెన్ (భీమదేవుని) పండుగ ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఘనపూర్ గ్రామంలో ఉన్న భీమల్‌పెన్ దేవతమూర్తులను మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జంగుబాయి, కపులాయి పవిత్రజలాల వద్దకు తీసుకువెళ్లి శుద్ధి చేసి తిరిగి ఘన్‌పూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా గురువారం గ్రామ కూడలిలో గ్రామానికి చెందిన ఆదివాసులందరు గుమ్మిగూడి భీమల్‌పెన్‌కు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు మాట్లాడుతూ పుష్య మాసంలో ఆదివాసులు చాలా పవిత్రంగా ఉంటారని ఇలాగే కొన్ని తరాలుగా వస్తున్న ఆచారాలను, భావితరాలకు అందించాలని మాజీ ఎంపీపీ అన్నా రు. గ్రామపటేల్ దివారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో ఆధ్యాత్మిక వాతావరణం

ఇంద్రవెల్లి: పుష్యమాసాన్ని పురస్కరించుకుని ఆదివాసీ గిరిజన గూడేల్లో జంగుబాయి దేవత ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వంశాల వారీగా పెర్సాపేన్ (పెద్ద దేవుడు), గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గురు వారం మండలంలోని పలు ఆదివాసీ కొలాం గిరిజన గూడేల్లో కొడప వంశస్థులు పెర్సాపేన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు బాగుండాలని, గ్రామంలో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ప్రతీ ఏడాది ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని కుంభర తండా, కొలాంగూడ గ్రామ పటేల్, కొడ పవంశం పూజారీ కొడప రాం చందర్ తెలిపారు.

జాబ్‌మేళాలను సద్వినియోగించుకోవాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్

ఉట్నూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఏ ప్రాంతంలో జాబ్ మేళా పెట్టిన స్పందించి అక్కడికి వెళ్లాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 75 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జాబ్‌మేళాలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించగా ఈ మేళాకు 75 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారన్నారు. గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీ వారి నియామకాలు జరిగాయని ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు మోహర్‌బాబు, రుత్విక్, వినోద్, మహేశ్ పాల్గొని అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. 75మంది హాజరు కాగా 11 మంది ఎంపికై నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ ముజీబ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ నర్సింగ్‌రావు, అధ్యాపకులు జావేద్, దేవన్నసజీర్ పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం జరగనున్న వైకుంఠ ద్వార దర్శనానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాటు చేసేందుకు భక్తులు ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన భక్తులు చందాలు సైతం సమ కూర్చారు. దీంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వేద పండితులు పండరి శర్మ పేర్కొన్నారు.

నాగపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

● బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాగపూర్ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. గురువారం గ్రామస్థుల పిలుపు మేరకు గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మురికి కాలువల నిర్మాణం, హనుమాన్ మందిరం జగదాంబ దేవి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని గ్రామస్థులకు తెలిపారు. సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాశిరం, మాజీ ఉపసర్పంచ్ బలిరాం రాజేష్, గ్రామ పటేల్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దర్శనానికి తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాములు గురువారం శబరిమల యాత్రకు బయలు దేరారు. 41 రోజుల పాటు నిష్ఠ నియమాలతో ఉన్న స్వాములు జ్యోతి దర్శనానికి శబరిమలకు తరలి వెళ్లారు. సివిల్ స్వాములతోపాటు కన్నె స్వాములు, గురు స్వాములు తరలివెళ్లగా వారి వారి కుటుంబాల వారు స్వాములను సాగనంపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ఇంద్రవెల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తంను ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు ఆధ్వర్యంలో తుడుం దెబ్బ నాయకులు గురువారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో శాలు వాతో ఘనంగా సన్మానించారు. ఇందులో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు సోయం రాందాస్, జిల్లా కార్యదర్శి గేడం భారత్, మండల ప్రధాన కార్యదర్శి సోయం మురారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణంతో కమిటీల ఏర్పాటు

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి అన్నారు. గురువారం న్యూ హౌజింగ్ బోర్డులోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల ఇన్‌చార్జిగా ఆయన పాల్గొని 15 మండలాలకు గాను 8 మండలాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి మాట్లాడుతూ పల్లె సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేలా ముందుకు సాగుతున్నా మన్నారు. ఇప్పటికే పార్టీ సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. క్రియాశీల సభ్యత్వాలు తీసుకున్న వారికి మండలాల అధ్యక్షులుగా ప్రకటించడం జరిగిందన్నారు. 15 మండలాల్లో 8 మండలాలకు అధ్యక్షులను ఏక నిర్ణయం మేరకు ప్రకటించడం జరిగిందన్నారు. తదుపరి 7 మండలాలకు 12న ప్రకటిస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన మండలాల అధ్యక్షుడు ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రాల్లో సన్మాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదే విధంగా పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, నాయకులు ఆదినాథ్, జ్యోతిరెడ్డి, లాలామున్న రాకేష్, మయూ ర్‌చంద్ర పాల్గొన్నారు.

బీజేపీ ఇచ్చోడ మండలాధ్యక్షుడిగా అశోక్

ఇచ్చోడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలాధ్యక్షుడిగా మండలంలోని అర్లి (టీ) గ్రామానికి చెందిన అంకం అశోక్‌ను గురువారం జిల్లా కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు శాలువా కప్పి సత్కరించారు. తనపై నమ్మకంతో మండలాధ్యక్ష పదవి ఇచ్చినందుకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాయల్ శంకర్, ఎంపీ, సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

..బోథ్ మండల అధ్యక్షుడిగా రవీందర్

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండల భారతీయ జనతా పార్టీ కన్వీనర్‌గా బోరే రవీందర్ రెండవసారి మండల కన్వీనర్‌గా నియామకం జరిగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా నియమించారు. రెండోసారి నియమించినందుకు పార్టీ పటిష్టతకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

నేరడిగొండ మండల అధ్యక్షుడిగా సంతోష్‌సింగ్

నేరడిగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల అధ్యక్షులు జాబితాను రిటర్నింగ్ అధికారి పల్లెగంగారెడ్డి గురువారం విడుదల చేశారు. నేరడిగొండ మండల అధ్యక్షునిగా ప్రస్తుత అధ్యక్షుడు సాబ్లెసంతోష్‌సింగ్ మరోసారి నియమితులయ్యారు.

మా గ్రామాన్ని పంచాయతీలోనే కొనసాగించాలి

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరుపులపల్లి గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ జుగ్నాక్ మారుతి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థులు జిల్లా పంచాయతీ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామాన్ని పార్డీ (బీ) గ్రామపంచాయతీలో కొనసాగించాలని జిల్లా పంచా యతీకి విన్నవించారు. ఆయన వెంట పరుపులపల్లి గ్రామానికి చెందిన ఆత్రం ధర్మన్న, పెందూరు సుంగన్న, అరక గంగన్న, ఆత్రం నాగరావు, ఆత్రం రవి, ఆత్రం జగదీష్, కొడప జుగ్నాక్, ఉపాధిరావు, గంగారం ఉన్నారు.

ఆడే గజేందర్‌ను కలిసిన నాయకులు

నేరడిగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను బోథ్ పట్టణ యువ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బజార్‌హత్నూర్ మండలంలోని మోర్కండి, ఉప్పర్‌పల్లి గ్రామస్థులు, కలిసి వారి సమస్యలను వివరించారు. గ్రామస్థులు తిపిన సమస్యలకు సానుకూలంగా స్పందించి తప్ప కుండా సమస్యలను పరిష్కరిస్తానని చెప్పిన ఆడే గజేందర్‌ను కలిసిన వారిలో రాథోడ్‌నంద్, కుమార్, తులసి, ఇస్తారి, దేవదాస్, దయానంద్, నాగోరావు, దామోదర్, నాందేవ్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే
పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీడీవో



అంజనీ తండా గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని నర్సాపూర్(జి) ఎంపీడీవో పుష్పలత అన్నారు. గురువారం మండలంలోని అంజనీ తండా, తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

రోడ్డు నిబంధనలు కచ్చితంగా పాటించాలి



సూచనలు అందజేస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్

తానూర్ , జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు కచ్చితంగా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటర్ అసిస్టెంట్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బీఆర్‌కే సత్యమూర్తి అన్నారు. మండలంలోని బేల్‌తరోడా గ్రామ సమీపంలో గల అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం వాహనాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలని, డ్రైవింగ్ లైసెన్సు, వాహనం ఇన్సూరెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఫోర్‌వీలర్ వాహనాదారులు వాహనంలో ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకొని వాహనాన్ని నడపాలన్నారు. మరి ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్స్ మాట్లడవద్దని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్క వాహనదారులు పాటించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరుకోవాలని వాహనదారులకు సూచించారు. ఈ వారోత్సవ కార్యక్రమంలో చెక్‌పోస్టు కార్యాలయ సిబ్బంది, ప్రయాణికులు, వాహనాదారులు ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు



కుంటాల, జనవరి, 9 : (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ నైలు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. గ్రామాలలో రాత్రి వేళలో ప్రత్యేకమైన గస్తీ నిర్వహిస్తూ యువతకు చెడు వ్యసనాలకు లోనుకాకుండా పలు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై భాస్కరాచారి తదితరులు ఉన్నారు.

ఎంఎస్‌పీ కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే చేయాలి

● అటవీ హక్కుల చట్టం 2006ను సమగ్రంగా అమలు చేయాలి ● ఉపాధి హామీ కూలీలకు 200ల రోజుల పనిని కల్పించాలి
● అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో నిర్మల్‌లో కదం తొక్కిన రైతులు

నిర్మల్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా డిమాండ్ డే సందర్భంగా గురువారం నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐయూకేఎస్ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులతో ప్రదర్శ ర్యాలీ నిర్వహించి అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పాలన కార్పొరేట్, ధనిక వర్గాల వారికి అనుకూలంగా ఉందని విమర్శించారు. మోదీ పాలనలో పెట్టుబడిదారులు, ధనవంతుల చేతుల్లోనే దేశ సంపద అంతా కేంద్రీకృతమై ఉంటే మరోపక్క 45 శాతం గ్రామీణ ప్రజలు, 56 శాతం గ్రామీణ మహిళలకు రోజు రెండు పూటలకు మించి ఆహారం అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ కనీస మద్దతు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200ల రోజుల పని దినాలు కల్పించాలన్నారు. రోజు కూలీ 600ల రూపాయలు పెంచాలన్నారు. అటవీ హక్కుల చట్టం 2006ను సమగ్రంగా అమలు చేసి, పోడు భూములకు పట్టాలివ్వాలని, భూమి లేనివారికి భూమి, ఆకలితో ఉన్న వారికి ఆహారం, ఇళ్లు లేనివారికి ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో రైతుల రుణమాఫీని అమలు చేయాలని, చిన్న సన్నకారు రైతులకు రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో రైతు ఉద్యమాలు ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కట్ల రాజన్న, పార్టీ జిల్లా నాయకులు రామలక్ష్మణ్, ఏఐయూకేఎస్ జిల్లా నాయకులు ఎం. అంకుష్ రావు, జక్కుల రాజన్న, కే. ఎల్లయ్య, అడ్డగట్ల శంకర్, వర్మ, కుర్మ రాజన్న, భీమ్ రావు, మధు, సోనేరావు, పూసం లక్ష్మణ్, కుర్మ లింగన్న, గోరేభాయ్, దేవరావు, చందు, తదితరులు పాల్గొన్నారు.

గృహోపకరణాల తయారీ శిక్షణ సర్టిఫికెట్‌ల అందజేత



శిక్షణ సర్టిఫికెట్‌లు అందుకున్న మహిళలతో అధికారులు

దిలావర్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో యాక్సెంచర్, ఈడీబీఐ వారి ఆధ్వర్యంలో గృహోపకరణాలు తయారీపై 26 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్‌లను అందజేశారు. 26 రోజులపాటు సర్ఫ్, సబ్బులు, ఫ్లోర్‌క్లీనర్, డిష్‌వాష్ పౌడర్, టాయిలెట్ క్లీనర్‌ల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం సులోచన రెడ్డి మాట్లాడుతూ... మహిళలు ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న వివిధ గృహోపకరణాలతో స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని తమ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. గుండంపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఏ.రవికుమార్ మాట్లాడుతూ... మహిళలకు స్వయం ఉపాధికి పెట్టుబడిగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళలకు సంబంధించిన రుణ అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గుండంపల్లి పంచాయతీ సెక్రటరీ స్వాతి, సీసీలు పోశెట్టి, ముత్యం, వీవోఏలు రాములు, ముత్యం, మాస్టర్ ట్రైనర్ రవి, మహిళలు పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

● బీజేపీ నాయకుడికి యూత్ కాంగ్రెస్ హెచ్చరిక ● ఖానాపూర్‌లో దిష్టిబొమ్మ దహనం





ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు.. బీజేపీ మాజీ ఎంపీ రమేష్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

ఖానాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రశ్రేణి నాయకురాలు ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీజేపీ మాజీ ఎంపీ రమేష్‌ను ఖానాపూర్ మండల యూత్ కాంగ్రెస్ హెచ్చరించింది. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాల మేరకు గురువారం ఖానాపూర్‌లోని తెలంగాణ చౌక్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ ఎంపీ రమేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రమేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎం. వంశీ, ఉపాధ్యక్షులు ఎస్. మహేష్, ప్రధాన కార్యదర్శి బుడిగే సంతోష్ కుమార్, నాయకులు మెస్రం హరి, రాహుల్, ఎంబడి విజయ్, పి. వంశీ, బిక్కి శ్రావణ్‌కుమార్, సుద్దాల నవీన్, యోగి, రమేష్, తదితరులున్నారు.

నేడు వెదురు కర్రల బహిరంగ వేలం

ముథోల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామ శివారులో గల ప్రభుత్వ ఉద్యానవనంలో ఉన్న వెదురు కర్రలను (ప్రభుత్వ మోడల్ బాంబూ ఫారం) శుక్రవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి బి.వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు ధరావత్ 5,000 చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఇందులో ఎవరు ఎక్కువ రేటు పలికితే వారికి వేలం ఇవ్వబడుతుందన్నారు. వేలం దక్కించుకున్న వారు ఈ నెల 31 తేదీ లోపు మొత్తం డబ్బులను చెల్లించాలన్నారు. చెల్లించని యెడల వేలం రద్దు చేస్తామని తెలిపారు. వేలంపాటలో అనుకున్న రేటు రాకున్నా వేలంపాటను రద్దు చేసే అధికారం ఉందన్నారు.

పిల్లల వైద్య నిపుణుల జాతీయ సదస్సులో
పాల్గొన్న నిర్మల్ జిల్లా వైద్యులు



నిర్మల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ హైటెక్స్‌లో పిల్లల వైద్య నిపుణుల జాతీయ సదస్సులో పట్టణంలోని సీని యర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ సుధీర్ కు మార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... సామూహిక ప్రాణాపాయ, ప్రా ణాంతక ప్రమాదాలను ఎదుర్కోవడంలో సంసిద్ధత, సన్నాహకాలు, ఇన్సెం టివ్ కేర్ యూనిట్స్‌లలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా సర్వ సన్న ద్ధంగా ఉండడానికి సిములేషన్ ట్రైనింగ్‌లు అనే అంశాలపై పరిశోధనాత్మక ప్రసంగాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రన్, ప్రొఫెసర్ డాక్టర్ మహేష్ మోహితే పా ల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ రక్త నమూనా పరీక్షలు



లక్ష్మణచాందలో ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

లక్ష్మణచాంద, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ వైద్య సిబ్బంది గురువారం రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా ఈ మధ్య చాలా మందికి సాధారణంగా వస్తున్న రోగాలు అయినటువంటి షుగర్, బీపీ లాంటి వ్యాధులకు సంబంధించి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో హరికుమార్‌గౌడ్, ఏఎన్ఎం యాస్మిన్, ఆశా కార్యకర్త దొంతుల లక్ష్మీ, తదితరులు ఉన్నారు.

వెంకటాపూర్‌ను
నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలి



మామడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్దుర్తి గ్రామ పంచాయతీలోని వెంకటాపూర్ తండాను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును గురువారం గ్రామస్థులు కోరారు. ఉమ్మడి గ్రామ పంచాయతీలో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నల్దుర్తి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, అజ్మీరా రాజు, జీవంత రావు, భూక్యా రవి, వసంతరావు, రాజేందర్ ఉన్నారు.

ఫటా..ఫట్...

రైతుల అభివృద్ధే లక్ష్యం

● ముథోల్ ఏడీఏ బి.వినయ్ బాబు



ముథోల్ వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతుల అభివృద్ధే లక్ష్యమని ఏడీఏ బి.వినయ్‌బాబు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ..

ప్రశ్న: ముథోల్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఎన్ని ఎకరాలలో సాగు భూమి ఉంది...? ఎంత మంది రైతులున్నారు...?

జవాబు: ముథోల్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం మండలంలో మొత్తం 70 వేల రైతులకు గాను 1,25,899 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ రబీ సీజన్‌లో సుమారు 50 వేల రైతులు 83,716 ఎకరాలలో మొక్కజొన్న, శనగ, సన్ ఫ్లవర్, వరి, జొన్న, గోధుమ, తదితర పంటలు సాగు చేస్తున్నారు.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మంది రైతులు రైతు బీమా పథకం డబ్బులు అందజేశారు..?

జవాబు: ముథోల్ వ్యవసాయ డివిజన్‌లోని 40 మంది రైతులకు రైతు బీమా డబ్బులు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం నుంచి అందజేశాం. మరో 10 మంది రైతులకు రైతు బీమా డబ్బులు వచ్చేవి ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే అందజేస్తాం.

ప్రశ్న: రైతులకు రైతు బంధు పథకం ఎప్పుడు అందజేస్తారు...? ఎరువులు అందుబాటులో ఉన్నాయా...?

జవాబు: రైతు బంధు పథకానికి సంబంధించింది రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకెళ్తాం. రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల గురించి ఎలాంటి దిగులు చెందాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: రైతులకు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు...?

జవాబు: రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా తగు సలహాలు, మెళకువలు ఇస్తున్నాం. అవసరమైతే క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటలు పరిశీలిస్తున్నాం. చీడపీడల నివారణ గురించి వివరిస్తున్నాం. అలాగే ప్రతి మంగళవారం ఒక రైతు వేదికలో రైతు నేస్తాం కార్యక్రమం నిర్వహిస్తున్నాం. రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సలహా, సూచనలకు రైతు వేదిక, ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

● (ఆంధ్రజ్యోతి, ముథోల్)

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

● నిర్మల్ జిల్లాలో దరఖాస్తులు 1,92,233
● సర్వే పూర్తయిన దరఖాస్తులు 1,84,683
● 5 శాతం దరఖాస్తుల పున: పరిశీలనకు ఆదేశాలు
● క్షేత్రస్థాయిలో నమోదైన వివరాలను పరిశీలిస్తున్న అధికారులు



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

భైంసా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపుసర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. లోపాలకు తావులేకుండా సర్వేను పూర్తి చేసేందుకుగాను పకడ్బందీగా వ్యవహరిస్తోంది. పారదర్శకత విధానాలతో సర్వే నిర్వహించేందుకు గాను యాప్ ద్వారా వివరాల నమోదును నిర్వహింప చేస్తోంది. అయితే సంబంధిత సర్వే నిర్వహణలో ఎక్కడైనా లోపాలు, పొరపాట్లు, అక్రమాలు, తప్పుడు సమాచారాలు నమోదు చేశారా అనే విషయమై ప్రభుత్వం దరఖాస్తుల పున: పరిశీలనలకు ఉపక్రమించింది. ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేలో ఏమైనా అక్రమాలు జరిగాయా? యాప్‌లో ప్రజాపాలన దరఖాస్తుదారుల వివరాలనే నమోదు చేస్తున్నారా? అర్జీదారుల ప్రయోజనాల కోసం సర్వేయర్లు ఏమైనా తప్పుడు సమాచారం నమోదు చేశారా? అనే అంశాలపై రాష్ట్ర గృహనిర్మాణ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, 18 మండలాల్లో మొత్తం 1,92,233 దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత దరఖాస్తుల పరిశీలన, సర్వేకోసం గాను గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, పురపాలికల్లో వార్డు అధికారులతో పాటు కొన్ని చోట్ల ఇతర సిబ్బందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సర్వే కోసం నియమించిన వారందరూ దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్లి 360 డిగ్రీల కోణంలో సర్వే చేపడుతున్నారు. గురువారం 1,84,683 వరకు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వేయర్లు యాప్ ద్వారా వివరాలు సేకరించారు. సర్వే పూర్తయిన వాటిలో సూపర్ చెక్ పేరుతో ఐదు శాతం దరఖాస్తులను గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఆ శాఖ పీడీలకు, గ్రామాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల లాగిన్‌కు పంపిస్తున్నారు. లాగిన్‌కు వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలనలు చేపడుతున్నారు. క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్వేయర్ల యాప్‌లో నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయో? లేదో? అనే విషయాలను పరిశీలించే చర్యలను చేపడుతున్నారు. ఎక్కడైనా తప్పుడు వివరాలు నమోదు చేసినట్లు తేలితే సంబంధిత సర్వేయర్లపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లుగా తెలిసింది.

● సంక్రాంతి తర్వాత గ్రామ సభలు...

గత సంవత్సరం నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం గాను జిల్లాలో 1,92,233 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,84,683 (96.07 శాతం) దరఖాస్తుల యాప్ సర్వే పూర్తయ్యింది. సంక్రాంతి లోపు సంబంధిత సర్వే పూర్తిచేసేందుకు గాను అధికార యంత్రాంగం చర్యలను చేపట్టింది. ఒక వైపు సర్వే ప్రక్రియ నిర్వహింపచేస్తూనే మరోవైపు సూపర్ చెక్ ప్రక్రియ చేపట్టేలా అధికారులు చర్యలను వేగవంతం చేశారు. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను రూపొందించే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సంక్రాంతి తర్వాత గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులోనే లబ్ధిదారుల ఖరారు ప్రక్రియ జరుగనుంది. ఇందిరమ్మ కమిటీలు ఈ లబ్ధిదారుల ఎంపికలో క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి. ఎక్కడైనా కమిటీలు ఏర్పాటు కాకపోతే ఈ వారం రోజుల్లో పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

చలి పంజా

● బేల మండలంలో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



ఆదిలాబాద్ శివారులో కనిపిస్తున్న దట్టమైన పొగమంచు



రైల్వేస్టేషన్ వద్ద పొగమంచు

ఆదిలాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాపై మళ్లీ చలిపంజా విసురుతోంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీస్తున్న శీతల గాలులతో చలితీవ్రత పెరిగి సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 6.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో అత్యల్పంగా 5.9 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా మావలలో 6.9, తాంసిలో 7.7, తలమడుగులో 7.9, గాదిగూడలో 8.0 బజార్‌హత్నూర్‌లో 9.1, సిరికొండలో 9.5 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా చలితీవ్రత కనిపిస్తుంది. ఉదయం సాయంత్రం వేళల్లో బయటకు వచ్చేందుకు జనం వణికిపోతున్నారు. అత్యవసరమైతే వెచ్చని దుస్తులను ధరించి బయటకు వెళ్తున్నారు. ముఖ్యంగా రాత్రి, ఉదయం వేళల్లో చలి మంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లోనైతే చలిప్రభావం అధికంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. చెరువులు, కుంటలు, వాగులు, దట్టమైన అడవులు, నల్లరేగడి నేలలతో జిల్లాలో ఏటా చలిప్రభావం అధికంగానే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ వరకు సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని పేర్కొంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని మరికొన్నాళ్ల పాటు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.

బెటాలియన్‌కు 412 మంది కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్న 412 మంది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని సెకండ్ బెటాలియన్‌లో రిపోర్ట్ చేశారు. బెటాలియన్ కమాండెంట్ నికిత పంత్ వారికి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. నూతనంగా విధుల్లోకి హాజరైన వారి విధుల గురించి వివరించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

కేస్లాపూర్‌కు చేరిన నాగోబా ప్రచార రథం



వడ్‌గావ్ గ్రామం నుంచి కేస్లాపూర్ బయలుదేరిన నాగోబా ప్రచారరథం

ఇంద్రవెల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరకు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకొని ఈనెల 28న నిర్వహించే మహాపూజ ప్రచారం కోసం ప్రారంభించిన ప్రచార రథం గురువారం రాత్రి కేస్లాపూర్ గ్రామానికి చేరింది. ఈ నెల 2న నెలవంక దర్శనం చేసిన మెస్రం వంశీయులు ఈ నెల 3న కేస్లాపూర్ నుంచి ప్రారంభించిన మెస్రం వంశీయుల ప్రచార రథయాత్ర సిరికొండ మండలానికి చేరి నాగోబా మహాపూజకు అవసరమైన కుండల తయారీకి ఆదేశాలు ఇచ్చారు. అక్కడి నుంచి సిరికొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని మెస్రం వంశీయులు ఉన్న గ్రామాలను సందర్శించి పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర నిర్వహణపై ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని మెస్రం వంశీయులు, కటోడా మెస్రం కోసేరావు, ప్రధాన్ మెస్రం దాదారావులకు అతిథి మర్యాదచేశారు. గురువారం మండలంలోని వడ్‌గాం నుంచి కేస్లాపూర్ గ్రామానికి చేరుకున్నారు.

● నేడు పవిత్ర గంగా జలం కోసం మెస్రం వంశీయుల పాదయాత్ర పయనం

కేస్లాపూర్ నాగోబా మహాపూజ నిర్వహణపై పాదయాత్రపై శుక్రవారం మధ్యాహ్నం మెస్రం వంశీయులు సమావేశం కానున్నారు. గంగాజలం సేకరించడానికి పాదయాత్రగా బయల్దేనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ తెలిపారు.

పల్లె దవాఖానకు 108 మంజూరు

నార్నూర్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని లోకారి(కే)పల్లె దవాఖాన సబ్ సెంటర్‌లో గురువారం 108 వాహనానికి గ్రామస్తులు ఆదివాసీ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామపటేల్ మెస్రం భీంరావు, శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసీ మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు 108 వాహనాన్ని పల్లెదవాఖానాలకు మంజూరు చేయడం శుభపరిణామన్నారు. వాస్తవానికి ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్, గాదిగూడ మండల ప్రజలకు రోడ్డువ్యవస్థ బాగులేనందున ఇక్కడి ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెస్రం దేవ్ రావు, కొడప జాకు, జై గ్రామ పటేల్ సోము, ఉద్దె రాజు, లింగు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైన్స్‌లకు నిలిచిన కింగ్ ఫిషర్ బీరు సరఫరా



కింగ్ ఫిషర్ బీరుసీసాలు

భైంసా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైన్స్‌లకు టీజీ బీసీఎల్ ఆదిలాబాద్ డిపో గురువారం కింగ్ ఫిషర్ బీరు సీసాల సరఫరాను నిలిపివేసింది. యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీ) సంస్థ తమ కింగ్ ఫిషర్ బ్రాండ్ బీర్ల విక్రయాలను రాష్ట్రానికి నిలిపివేసింది. దీంతో బుధవారం నుంచి టీజీ బీసీఎల్ డిపోలకు యూబీ సంస్థ ద్వారా బీర్ల సరఫరా నిలిచిపోయింది. సంబంధిత సమాచారం అందుకున్న వైన్స్ యజమానులు ముందు చూపుతో డిపోలోనున్న కింగ్ ఫిషర్ బీర్ల స్టాక్‌ను కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం అధిక సంఖ్యలో కింగ్ ఫిషర్ బీరు కేసుల కోసం గాను ఇండెంట్ పెట్టారు. ఒక్కసారిగా అన్ని వైన్స్‌ల నుంచి అధిక మొత్తంలో ఇండెంట్ రావడంతో డిపోలోని కింగ్ ఫిషర్ బీరు కేసుల నిల్వలు పూర్తి స్థాయిలో లేకపోవడాన్ని గుర్తించిన డిపో నిర్వాహణాధికారులు వైన్స్‌లకు వాటి సరఫరాను నిలిపి వేసినట్లుగా తెలిసింది. ఈ క్రమంలో గురువారం టీజీ బీసీఎల్ ఆదిలాబాద్ డిపో పరిధి నుంచి జిల్లాలోని అన్ని వైన్స్‌లకు కింగ్ ఫిషర్ బీరు కేసుల సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం డిపోలోని కింగ్ ఫిషర్ బీరు కేసుల నిల్వల పరిస్థితిని పరిగణలోకి తీసుకొని తదనంతరం వాటిని కోటా పద్ధతిలో వైన్స్‌లకు కేటాయించి సరఫరా చేసేందుకు గాను టీజీ బీసీఎల్ ఆదిలాబాద్ డిపో అధికారులు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. కింగ్ ఫిషర్ బీర్లు అరకొరగా లభ్యమయ్యే పరిస్థితులు నెలకొనడంతో వాటి ప్రియులు అధిక మొత్తంలో కొనుగోలు చేసి ఇళ్లలో దాచిపెట్టుకునే చర్యలు చేపడుతున్నారు.

జాతీయ స్థాయిలో
కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

నేరడిగొండ,జనవరి9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జల్గావ్, మహారాష్ట్రలో ఈ నెల 5 నుంచి 9 వరకు జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 పోటీలలో తెలంగాణ బాలికల జట్టు తరపున నేరడిగొండ కేజీబీవీ చెందిన ఆర్.శ్రీలేఖ, ఎం .శ్రీనిత్యలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలికల జట్టు తరపున ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయ స్థాయిలో కాంస్య పతకం గెలుపొందడం జరి గింది. దీని పట్ల ఆదిలాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ స్వామి పీడీ పాఠశాల ప్రత్యేక అధి కారి ఎల్.రజిత, పీఈటీ స్నేహ అభినందించారు.

ముక్కోటి వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

● ముస్తాబైన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం




ముస్తాబైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం

భైంసా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజాము వేళలో జరిగే ముక్కోటి వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు భైంసా లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ నిర్వాహక కమిటీ పేర్కొం ది. పర్వదిన వేడుకల్లో భాగంగా ఉత్తర ద్వార మోక్ష దర్శనముల కోసం గాను ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లుగా వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని ఉదయం 4 గంటల నుంచే ఆలయంలో పూజాకార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం 4 గంటలకు ఉత్సవ మూర్తుల అభిషేకం, 4:30 గంటలకు దీపాల అలంకరణ, 5:30 గంటలకు ప్రత్యేకపూజ, 6 గంటల నుంచి ఉత్తర ద్వార మోక్ష దర్శనము కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో వేడుకలకు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి సమస్యలు ఏర్ప డకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ముక్కోటి వైకుంఠ ఏకా దశి సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తులు లక్ష్మీవేంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.



ఉత్సవమూర్తులు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 30.3 : కనిష్టం 6.7




పదవుల కోసం.. పైరవీలు!



- నామినేటెడ్ పదవులపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- టీపీసీసీ చీఫ్ ప్రకటనతో కాంగ్రెస్ నేతల్లో చిగురిస్తున్న ఆశలు
- సంక్రాంతి కానుకగా పదవులు కేటాయించే అవకాశం
- అధిష్ఠానం పెద్దల వద్దకు పరుగులు తీస్తున్న నేతలు
- డీసీసీబీ చైర్మన్ పదవి రెన్యూవల్‌పై మొదలైన ఉత్కంఠ

ఆదిలాబాద్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాది గడిచిపోవడంతో పదవుల కోసం నేతలు పైరవీలు చేస్తున్నారు. ఇటీవల టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, ఇతర ముఖ్య నేతలు జిల్లాలో పర్యటించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ పలు ఆసక్తికర ప్రకటనలు చేయడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. సంక్రాంతి తర్వాత అన్నిరకాల నామినేటెట్ పదవులను భర్తీ చేస్తామని పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో నేతలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో సమయం దొరికితే చాలు హైదరాబాద్‌కు పరుగులు తీస్తూ పెద్దల ఆశీస్సుల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటికే తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొందరు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్‌లో కొత్తగా సీనియర్, జూనియర్ అనే వివాదం తెరపైకి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న సీనియర్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తమ నేతకే పదవులు ఇవ్వాలని అనుచరులు గట్టిగా వాదిస్తున్నారు. దీంతో ఏదో ఒక పదవి దక్కుతుందన్న ధీమాతో పలువురు నేతల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా విజయడెయిరీ, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ చైర్మన్ పదవులతో పాటు మార్కెట్ కమిటీ, దేవాదాయ చైర్మన్, ఐసీడీఎస్ చైర్మన్, ఐటీడీఏ చైర్మన్, డీసీసీ పార్టీ పదవుల కోసం నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే అన్నిరకాల నామినేటెట్ పదవులతో పాటు పార్టీ పదవులను భర్తీ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అదృష్టం కలిసి వచ్చేనా..?

సంక్రాంతి పండుగ తర్వాత నామినేటెట్ పదవులతో పాటు పార్టీ పదవులు, కార్పొరేట్ పదవులను కేటాయిస్తామని స్వయాన టీపీసీసీ అధ్యక్షుడు ప్రకటించడంతో జోరుగా చర్చ సాగుతోంది. సంక్రాంతి తర్వాత ఎవరి అదృష్టం ఎలా ఉంటుందోనన్న టాక్ వినిపిస్తుంది. కొందరు నేతలైతే తమ జాతకాలను చూసుకుంటూ పదవులపై ధీమాతో కనిపిస్తున్నారు. అలాగే ఈ మధ్యకాలంలో కొందరికి దైవభక్తి కూడా ఎక్కువగానే కనిపిస్తుందని చెబుతున్నారు. 'ఏదో ఒక పదవి వచ్చేలా చూడు దేవుడా' అంటూ నిత్యం దండం పెడుతూ ఆపద మొక్కులు మొక్కుతున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రాధాన్యం ఇస్తామని ఎన్నికల సమయంలో పార్టీలో చేర్చుకున్న వారితో పాటు సీనియర్ నేతల పేర్లను పరిగణలోకి తీసుకునే అవకాశం కనిపిస్తుంది. రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెట్ పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్థాయి విజయ డెయిరీ చైర్మన్ పదవిని జిల్లాకు కేటాయించింది. ఈ సారి ఆ పదవి జిల్లాకు వస్తుందో రాదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కంది శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా జిల్లాకు చెందిన ముఖ్యనేతలంతా హైదరాబాద్‌లోనే మకాం వేసి పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

గాడ్‌ఫాదర్ల పైనే నేతల భరోసా..

పార్టీలో తమకున్న పరిచయాలతో పదవులను దక్కించుకునేందుకు నేతలు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారే తమ గాడ్‌ఫాదర్ల ద్వారా లాబీయింగ్ చేస్తూ పదవులపై భరోసా పెట్టుకుంటున్నారు. నిత్యం పార్టీలో జరుగుతున్న పరిణామాలను పసిగడుతూ తమకు అనుకూలంగా మల్చుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. కానీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నిర్ణయం ప్రకారమే నామినెట్ పదవులు దక్కే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతున్న క్రమంలో ఇన్‌చార్జిలే ఫైనల్ కాదంటూ ఇటీవల టీపీసీసీ చీఫ్ కామెంట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆదిలాబాద్ నియోజకవర్గంలో గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి, సాజిద్‌ఖాన్‌లను పార్టీ పక్కన పెట్టడంతో కంది శ్రీనివాస్‌రెడ్డిదే హవా కనిస్తోంది. అలాగే బోథ్ నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జితో పాటు ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ సోయం బాపురావ్ నిర్ణయం కీలకంగా మారనుంది. ఖానాపూర్‌లో మాత్రం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చెప్పిందే ఫైనల్ అన్నట్లుగా కనిపిస్తుంది. అయితే కాంగ్రెస్‌లో లాబీయింగ్ చేసిన వారికే పదవులు దక్కుతాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

అయితే డీసీసీబీ.. లేకుంటే డీసీసీ!

బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ కనిపిస్తోంది. మరో నెల రోజుల్లో డీసీసీబీ చైర్మన్ పదవీ కాలం ముగియనుంది. దీంతో ఆయనకు మళ్లీ ఏ పదవి దక్కనుందోనన్న ఆసక్తి నెలకొంది. డీసీసీబీ చైర్మన్ పదవి రెన్యూవల్ అయితే ఓకే.. లేదంటే ఆయన డీసీసీ పదవి రేసులోను ఉంటారన్న టాక్ జోరుగా వినిపిస్తోంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో బలమైన నాయకుడిగా పేరున్న అడ్డి భోజారెడ్డికి ఏదో ఒక పదవిని కేటాయించి ప్రాధాన్యతను ఇచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా స్థాయిలో కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవిపై పలువురు పార్టీ నేతలు కూడా కన్నేసినట్లు తెలుస్తోంది.



పోలీసుల పనితీరును ఆన్‌లైన్‌లో తెలపాలి

- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



క్యూఆర్ కోడ్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను తెలియజేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ సిబ్బంది సమక్షంలో ప్రజా అభిప్రాయానికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇది వరకు రాష్ట్ర పోలీసుల సేవలపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కాల్స్ ద్వారా సేకరించి ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించేవారు. ప్రస్తుతం పిటిషన్ ఎఫ్ఐఆర్ ఈ చలాన్ పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలపై పోలీసు అధికారుల ప్రతిస్పందన, ప్రవర్తన వారి అభిప్రా యాలను నమోదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ఇన్‌స్పెక్టర్‌లు, సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి పాటుపడాలి

- ఆదివాసీ పర్ధాన్ నేతల పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మెస్రం శంకర్

మావల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా విమర్శలు చేయకుండా ఐక్యమత్యంగా ఉంటూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్రీయ జనజాతి పర్ధాన్ ఉద్ధన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షులు సిడాం రాంకిషన్, జిల్లా అధ్యక్షులు మెస్రం శంకర్‌లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి మాసంలో జిల్లాలో నిర్వహించే ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కుల దైవం హీరా సుక్కా జయంతి వేడుకలను ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వేడుకలపై ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన మేధావులు, పెద్దల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. అలాగే హీరా సుక్కా జయంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు కలెక్టర్లకు, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలకు, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి కలిసి వినతి పత్రాన్ని అందించేందుకు తేదీలను ఖరారు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆ సంఘటన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గేడం మాధవ్, కోశాధికారి సెడ్మకి సుభాష్, డివిజన్ అధ్యక్షులు మడావి దిగంబర్, సలహాదారులు పూసం ఆనందరావ్, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం భాస్కర్, జిల్లా అధ్యక్షుడు వెట్టి దేవిదాస్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులున్నారు.

స్పోర్ట్స్‌మీట్‌తో మానసికోల్లాసం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- పోలీసు క్రీడలు ప్రారంభం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు నిత్యం విధుల్లో ఒత్తిడిలో ఉంటారని వారికి స్పోర్ట్స్‌మీట్ మానసికోల్లాసం కలిగిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా పోలీసుల వార్షిక క్రీడ పోటీలను ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఏఆర్ హెడ్ ముందుగా పోలీసు క్రీడాకారుల గౌర వ వందనం స్వీకరించారు. అనంతరం గాలిలో బెలూన్స్, పావురాలను విడుదల చేసి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయా క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అంతకు ముందు క్రీడాజెండాను ఆవిష్కరించి క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్‌రావు, ఉట్నూర్ అసిస్టెంట్ ఎస్పీ కాజల్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అంధులు అన్ని రంగాల్లో రాణించాలి..

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను గురువారం ఆదిలాబాద్‌లోని టీటీడీసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. బ్రెయిలీ వైకల్యాన్ని జయిం చి అనుకున్న లక్ష్యాన్ని సాధించారని కొనియాడారు. ఆత్మ స్థైర్యంతో ముందుకు వెళ్తూ అంధులు అన్ని రంగాల్లో సూచించారు.

అధికారులకు శిక్షణ...

సీఎం ప్రజావాణి జిల్లా ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో సం బంధిత అధికారులకు, శిక్షణ, అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీకరణపై తహసీల్దార్లు, గ్రీవెన్స్ రెడ్‌క్రాస్ అధికారులు, కిసాన్ మిత్ర అధికారులు, ప్రత్యేకాధికారుల శిక్షణ, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా అవగాహన కార్యక్రమంలో దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ప్రజావాణి పైలట్ ప్రాజెక్టు ఆదిలాబాద్‌లో జన వరిలో ప్రారంభం కానున్న నేపథ్యం లో కీలక అంశాలపై, పబ్లిక్ హియరింగ్, ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారులను నియమించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్‌కుమార్, ప్రజా సంఘాల నుంచి శంకర్, కొండల్, విఠల్ రావ్, అమరేందర్ పాల్గొ న్నారు.

పొలాల్లోనే సోలార్ పంపులు..

సోలార్‌పవర్ ప్లాంట్ ఏర్పాటుపై కలెక్టర్ రాజర్షిషా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం కుసుమ్ యోజన పథకం వల్ల ఎంతో లబ్ది చేకూరుతోందన్నారు. పొలాల్లోనే సోలార్ పంపులు ఏర్పాటు చేసి మంచి లాభాలను పొందేందుకు, కుసుమ్ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ఆయా మండలాల్లో సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎంఆర్‌ఓ, ఏపీఎం, ఏఈలు కలిసి స్థల సేకరణ చేయాలని, 150 ఎకరాల స్థలం లక్ష్యంగా ఉందన్నారు.

కంది కార్యాలయం ముట్టడి

- బీజేవైఎం నాయకుల ఆందోళన


కంది శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయాన్ని ముట్టడిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై కంది శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేవైఎం నాయకులు ఆయన క్యాంప్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుక న్నారు. పోలీసులకు బీజేవైఎం నాయ కులకు తోపులాట జరిగింది. అనంతరం బీజేవై ఎం నాయకులు పద్మావార్ రాకేష్, సచిన్, సాయి గౌడ్, సాయిను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిం చారు.

అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు నగేష్

ఆదిలాబాద్, జనవరి9 (ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే పాయలశంకర్‌పై కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది‌శ్రీనివాస్‌రెడ్డి అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు నగేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన బీజేపీ నేతలతో కలిసి పాల్గొని కంది‌శ్రీనివాస్‌రెడ్డి వైఖరిని తీవ్రంగా ఖండిం చారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ కంది శ్రీనివాస్‌రెడ్డి మాటలు చేష్టలను చూసి నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవ చేశారు. బీసీ సామాజిక వర్గ నేతను కంది శ్రీనివాస్‌రెడ్డి ఆడు వీడు అనడాన్ని ఎంత వరకు సమంజసం అన్నారు. పాయలశంకర్ భూ కబ్జాలు చేస్తే మీ ప్రభుత్వంతో విచారణ జరిపిం చుకోవాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే పాయలశంకర్‌ను అభినందించిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. కంది శ్రీనివాస్‌రెడ్డి డబ్బు మద్యంతో మాట్లాడుతున్నారని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఇందులో రఘుపతి, విజయ్, మయూర్‌చంద్ర, కృష్ణయాదవ్, సోమ రవి, మహేష్, రాజు, దత్త మురిధర్‌ట్రాక్, భారత్, రాజేశ్, రాకేష్ తదితరులున్నారు.

మీ హక్కులను కాపాడుతాం

- డీఎల్ఎస్ఏ సెక్రటరీ బోనగిరి సౌజన్య



సదస్సులో మాట్లాడుతున్న సౌజన్య

తాంసి , జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల హక్కులను కాపాడడానికి మేమున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి బోనగిరి సౌజన్య అన్నారు. గురువారం తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బాల్యవివాహరహిత భారతదేశం అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి బోనగిరి సౌజన్య మాట్లాడుతూ ప్రస్తుతం బాలబాలికలపై ఎన్నో అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని అన్నారు. లీగల్‌సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వాలంట రీస్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లాబాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ఏ విధంగా అరికట్టొచ్చు, ఏ విధంగా ఆపొచ్చు వివరించారు.

ఆదివాసీలకు వరం అటవీ హక్కుల చట్టం

- ఎమ్మెల్యే బొజ్జుపటేల్


నాగార్జునసాగర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, జనవరి9 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన అటవీహక్కుల చట్టం ఆదివాసులకు వరంగా మారిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. గురువారం నాగార్జునసాగర్‌లో నిర్వహించిన అటవీ హక్కుల చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అటవీ హక్కు చట్టాలపై ప్రసంగిస్తూ శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. చట్టాల పై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ కొప్పులరాజు,ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు మేధావులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ జొన్న విత్తనాలు

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో జొన్న పంటను సాగుచేసే రైతులకు సబ్సిడీ జొన్న పంట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. పూలే సుచిత్ర నాలుగు కిలోల బస్తా వంద నలభై రూపాయలకు సీఎస్‌వీ 15 రకం ఐదు కిలోల బస్తాలు 250 రూపాయలకు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ జొన్న పంట ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల జాబితా ప్రదర్శన

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటైన నాటి నుంచి విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల జాబితాను ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు సేకరించి వారి పేర్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు. 1961లో పాఠశాల గ్రామంలో ఏర్పాటైంది. అప్పటి నుంచి పనిచేసిన ప్రధానోపాధ్యాయుల జాబితాతో కూడిన బోర్డును పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేశముఖ సచిన్ మాట్లాడుతూ గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుల వివరాలు గ్రామస్తులకు విద్యార్థులకు తెలువాలన్న ఉద్దేశంతో బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

హైమాస్ట్‌లైట్ల ఏర్పాటు పట్ల గ్రామస్తుల హర్షం

బోథ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల బోరి గ్రామంలో గురువారం గ్రామపెద్దలు హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు జాదవ్ అనిల్‌కు విన్నవించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే లైట్లు ఏర్పాటు చేయడంతో తమ గ్రామంలో వెలుగులు నిండాయని గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- మానసిక వైద్య నిపుణులు శ్రీనివాస్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 09 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల అనేక అనార్థలు కలుగుతాయని, దీనికి యువత దూరంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మిషన్ పరివర్తన్ నష ముక్త్ భార త్‌లో భాగంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీ చర్లకు మాస్టార్ వాలంట్రీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్‌లెవల్ కో- ఆర్డినేటింగ్ ఏజెన్సీ ప్రాజెక్టు ఆఫీసర్ సుధాకర్, వైద్యులు శ్రీనివాస్ డ్రగ్స్ వినియోగం, అనార్థలు, చికిత్సలు, మానిపించడం తదితర వాటి గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని సబిత, ఎడ్యుకేటర్ సాయి కిరణ్, సమాఖ్య అధ్యక్షులు దేవిదాస్ దేశ్‌పాండే, అంగ న్‌వాడీలు పాల్గొన్నారు.